క్లుప్తంగా

తెలంగాణకు యూరియా తరలింపుపై ఆర్డీవో విచారణ



తిరువూరు:మండలంలోని వావిలాల పీఏసీఎస్‌లో రైతులకు సరఫరా చేయాల్సిన యూరియాను తెలంగాణకు తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై సోమవారం ఆర్డీవో మాధురి విచారించారు. గ్రామంలో రైతుల ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న యూరియాను స్థానిక రైతుల అవసరాలకు మాత్రమే అందించాలని, ఈపోస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని ఆర్డీవో ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని, కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఆందోళనకు గురిచేయవద్దని హెచ్చరించారు. తిరువూరు తహసీల్దారు ఉదయభాస్కర్, సీఐ గిరిబాబు, వ్యవసాయాధికారిణి పద్మ పాల్గొన్నారు.

ఒకేసారి 3 పోస్టులకు ఎంపిక



ఆగిరిపల్లి: మండలంలోని చిన్న ఆగిరిపల్లికి చెందిన బడుగు మానస డీఎస్సీ ఫలితాల్లో ఒకేసారి మూడు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. పీజీటీలో 34, టీజీటీలో 46, ఎస్ఏ–హిందీలో 20వ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా ఆమెను బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

జి.కొండూరు: మండల పరిధి కట్టుబడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి, ఇండస్ట్రియల్ పార్కు సంయుక్తంగా గతంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 20 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు కళ్లజోళ్లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సురేష్, జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, బుల్లిరాజు చౌదరి, నాగిరెడ్డి, హెచ్ఎం కె.శైలజ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహణ

జి.కొండూరు:ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఫ్లోరోసిస్ నివారణ విభాగం అధ్వర్యంలో జి.కొండూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ కలుషిత బోరు బావుల నీరు తాగడం వల్ల ఈ వ్యాధి బారిన పడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ నివారణా విభాగం నుంచి వైద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

12వ వేతన సంఘం నియమించాలి

చాట్రాయి: 12వ వేతన సంఘాన్ని తక్షణమే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను తెలిపారు. మండలంలోని పోలవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. నాగేశ్వరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.రామారావు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి పి.రాఘవరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జి.సంజయ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ప్రమాణస్వీకారం

విస్సన్నపేట:స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు సమక్షంలో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్‌గా వెంపటి శ్రీకృష్ణ జనార్ధనరావు, నూతన కమిటీ సభ్యులతో దేవదాయశాఖ అధికారి అనురాధ ప్రమాణ స్వీకారం చేయించారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

మైలవరం:మైలవరం గ్రామ సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి చెక్ పవర్ రద్దు అయ్యింది. ఈ మేరకు సోమవారం జిల్లా పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. గ్రామ పంచాయతీలో గతంలో జరిగిన పనుల్లో అక్రమాలు జరిగాయని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదులు మేరకు డీఎల్‌పీఓ సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారని తెలిసింది. పంచాయతీకి సంబంధించిన పూర్తి అధికారాలన్నీ డీఎల్‌పీఓని చూడమన్నారని తెలిసింది.

సొంత ఖర్చులతో బోరుపంపు ఏర్పాటు

ఇబ్రహీంపట్నం:పశ్చిమ ఇబ్రహీంపట్నం గ్రామ ప్రజల ప్రయోజనాల కోసం బోరు పంపును వార్డు కౌన్సిలర్ రావి ఫణి ఏర్పాటు చేశారు. నీటి ఎద్దడితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను కౌన్సిలర్ రావి ఫణికి విన్నవించారు. దీంతో తక్షణమే స్పందించిన కౌన్సిలర్ తన సొంత ఖర్చులతో బోరు వేసి గ్రామస్తుల సమస్యను పరిష్కరించారు. అడిగిన వెంటనే బోరు వేయించిన ఫణి పనితీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధార్ సేవలు అందక అవస్థలు!

- సిబ్బంది లేక సచివాలయాల్లో సేవలు బంద్
- పోస్టాఫీసులో అరకొరగా నమోదు
- బ్యాంకుల్లో అందుబాటులో లేని ఆధార్‌సేవలు

తిరువూరు:ఏ ప్రభుత్వ పథకానికైనా తప్పనిసరైన ఆధార్ కార్డులో మార్పుచేర్పులు, నవీకరణ నిమిత్తం తిరువూరు నియోజకవర్గంలో శాశ్వత ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలకు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లో సేవింగ్స్ ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు తెరవడానికి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన, రైతుల ఈక్రాప్ నమోదు, విద్యార్థులు పాఠశాలల్లో అడ్మిషన్లకు ఆధార్ డేటా తప్పనిసరి. ప్రభుత్వోద్యోగాలు, ఉన్నత విద్యావకాశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఆధార్ పరిశీలన అవసరం కావడంతో తమ ఆధార్ కార్డుల్లో వివరాల సవరణకు లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తిరువూరు నియోజకవర్గంలో గతంలో ప్రైవేటు ఆధార్ కేంద్రాలతో పాటు వార్డు, గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో తాత్కాలిక ఆధార్ కేంద్రాలను కూడా షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు చేశారు. కానీ, గత ఏడాది కాలంగా ఆధార్ డేటాలో సవరణలకు, కొత్త ఆధార్ కార్డు పొందడానికి అందుబాటులో కేంద్రాలు లేక తెలంగాణ రాష్ట్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 16 సచివాలయాల్లో ఆధార్ సేవలందించగా ఇప్పుడు ఇవి కొనసాగట్లేదు.

సచివాలయాల్లో నిలిచిన సేవలు.....

గతంలో సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు కొంతమేర ప్రజల అవసరాలు తీర్చినప్పటికీ సిబ్బంది బదిలీ ప్రక్రియ కొనసాగుతుండటంతో ఆధార్ నమోదుకు అర్హత సాధించిన సిబ్బంది అందుబాటులో ఉండట్లేదు. తిరువూరు మండలంలోని మునుకుళ్ళ, లక్ష్మీపురం, తిరువూరు నగర పంచాయతీ పరిధిలో 2, 5 సచివాలయాలు, విస్సన్నపేట మండలంలోని తాతకుంట్ల, నర్సాపురం, విస్సన్నపేట–3, ఏకొండూరు మండలం చీమలపాడు, రామచంద్రాపురం, కంభంపాడు, రేపూడి, గంపలగూడెం మండలం ఆర్లపాడు, చింతలనర్వ, కొణిజర్ల సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. బదిలీల అనంతరం గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాల్లో అర్హులైన సిబ్బందిని నియమించకపోవడంతో ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఆధార్ నుంచి ధ్రువీకరణ పొందిన సిబ్బంది ఉన్న సచివాలయాల్లో నమోదు పరికరాలు లేకపోవడం, ఆధార్ కేంద్రాలున్న సచివాలయాల్లో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు సకాలంలో డేటా అప్‌డేట్ చేయించుకోలేక నష్టపోతున్నారు. పలుమార్లు ప్రజాసంఘాలు ఆందోళనలు నిర్వహించడం, పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారుల దృష్టికి ఈ సమస్య వెళ్లినా స్పందించిన దాఖలాలు కనిపించట్లేదు.



వార్డు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు కొనసాగించాలని తిరువూరులో ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు (ఫైల్)



విన్నపాలు బుట్టదాఖలు

పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలందించడానికి ముఖ్యమైన ఆధార్ డేటా కోసం తిరువూరు నియోజకవర్గంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు ఆధార్ నమోదు, నవీకరణ కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు గమనించి తిరువూరు నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో శాశ్వత ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.

– బి.వెంకటేశ్వరరావు, తిరువూరు



సిబ్బందిని నియమించాలి

సచివాలయల్లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ డేటా ఎంట్రీ నమోదు కేంద్రాలను వెంటనే పునః పారంభించాలి. ఈ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందిని అవసరమైతే డెప్యుటేషన్‌పై నియమించాలి. మీసేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. గ్రామాల నుంచి ఆటోల్లో మండల కేంద్రాలకు వచ్చి ఆధార్ నమోదు చేయించడంలో ఇబ్బందులు కలుగుతున్నందున ప్రభుత్వం స్పందించాలి.

– షేక్ సుభాని, తిరువూరు



గతంలో ఏకొండూరు మండలం చీమలపాడు సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం

బ్యాంకుల్లో అందుబాటులో లేని సేవలు...

జాతీయ బ్యాంకుల్లో ఆధార్ నవీకరణ సేవలందించాలని రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు తిరువూరు డివిజన్లోని పలు బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ పొందిన ఉద్యోగులను నియమించారు. పని భారం కారణంగా బ్యాంకుల్లో ఆధార్ డేటానమోదు, నవీకరణ బాధ్యతలపై సిబ్బంది దృష్టి సారించలేక ఈ కేంద్రాల్లో సేవలు అందుబాటులో లేవు.

సూర్యనారాయణరెడ్డికి నివాళి



పుట్రేల(విస్సన్నపేట):మండలంలోని పుట్రేల పంచాయతీ కోటిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన పుట్రేల సహకార సంఘం మాజీ చైర్మన్, విశ్రాంత ఉపాధ్యాయుడు భీమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి పెదకర్మ సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పాల్గొని మృతుడి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, పార్టీ నాయకులు వీరారెడ్డి, దోర్నాల దామోదరరెడ్డి, రేగళ్ల మోహనరెడ్డి, ముంగా జయరాజు తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు

తిరువూరు:స్త్రీశక్తి పథకం కింద మహిళా ప్రయాణికులకు తిరువూరు నుంచి గంపలగూడెం మీదుగా పలు రూట్లలో అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. మధిరకు నడిచే బస్సులు అంతర్రాష్ట్ర సర్వీసులైనందున ఉచిత ప్రయాణం అనుమతించే అవకాశం లేని కారణంగా తోటమూల, పెనుగొలను, కొత్తపల్లి, గోసవీడు రూట్లలో ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ సర్వీసులు నడుస్తాయని పేర్కొన్నారు.

కోటపాడులో ఫాగింగ్

చాట్రాయి: మండలంలోని కోటపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని కాలనీల్లో గృహాల్లో ఫాగింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేరుతో నిండా ముంచిన కూటమి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాస్

తిరువూరు:కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు నింపుతామని ఊరించి నిండా ముంచిందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. తిరువూరు 5, 9 వార్డుల్లో బాబు షూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నోటికి వచ్చిన వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మొక్కుబడిగా తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ పథకాలు మాత్రం అమలుచేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలకంటే రెట్టింపు ఇస్తానని పేదల్ని ఆశపెట్టి రిక్తహస్తం చూపిన కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఏవగింపు మొదలైందన్నారు. అన్యాయం జరిగితే ముందుగా తానే ప్రశ్నిస్తానని ఎన్నికల ముందు చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అవకతవకల గురించి ఎందుకు ప్రశ్నించట్లేదని నిలదీశారు. బాబు ప్రభుత్వం మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జిలు రామవరపు దినేష్, రామవరపు ప్రసాద్, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, రామవరపు మంజుల, పార్టీ నాయకులు వెలుగోటి ఆదినారాయణ, కాలసాని గోపాల నాగేశ్వరరావు, యరదేశి రామారావు, షేక్ జాకీర్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు. ఆ వార్డుల్లో పలువురు యువకులు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి స్వామిదాసు ఆహ్వానించారు.



తిరువూరు 5వ వార్డులో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్స్ ప్రదర్శిస్తున్న స్వామిదాసు, నాయకులు

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకుండా త్వరితగతిన పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి నిర్దిష్ట కాల పరిమితిని విధించామని, అర్జీలకు గడువులోగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఒకవేళ గడువులోగా సమస్యను పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి 73 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక అర్జీలు రావడం గమనర్హం. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కర రెడ్డి, సీడీపీఓ పిల్లి విజయ కుమారి, ఏడీఏ జి.విద్యాసాగర్, ఏఎస్‌డబ్ల్యూవో డి.శ్రీనివాసరావు, హెచ్‌ఓఆర్.హేమ, ట్రిపుల్ ఐటీ ఎస్సై జి.రాంబాబు, డీఎల్‌డీఓ పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరించి పరిశీలిస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

అవగాహన లోపంతోనే బాల్య వివాహాలు

15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ

నూజివీడు: తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతోనే తమ పిల్లలకు బాల్య వివాహాలు చేస్తున్నారని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ తెలిపారు. పట్టణంలోని యానాది కాలనీలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల మహిళలు అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాలు అనేవి భవిష్యత్ అభివృద్ధికి నిరోధమన్నారు. చిన్న తనంలో గర్భం దాల్చడం వలన ప్రసవ సమయంలో ఎక్కువ సమస్యలు ఎదురవుతాయని, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదురై తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. చిన్నతనంలోనే కుటుంబ బాధ్యతలు భుజాన వేసుకొని రావాల్సిన పరిస్థితులు నెలకొని తీవ్ర ఒత్తిడికి లోనవుతారన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ చక్కగా చదువుకోవాల్సిన వయస్సులో వివాహాలు చేసి పిల్లల భవిష్యత్‌ను నాశనం చేయడం సరికాదన్నారు. చట్టానికి వ్యతిరేకంగా బాల్య వివాహాలను చేస్తే రెండేళ్ల జైలు, రూ.2 లక్షల వరకు జరిమానా విధిస్తారన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తహసీల్దార్, ఎంపీడీఓ, సీడీపీఓ, సూపర్‌వైజర్, ఎస్సై, వీఆర్వోలలో ఎవరో ఒకరికి తెలియజేయాలన్నారు. సీడీపీఓ పిల్లి విజయకుమారి, సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి, న్యాయవాది పద్మాంజలి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

విస్సన్నపేట:స్థానిక బీజేఆర్ నగర్‌లో రేషన్ షాపు వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్, డీటీ శివనాగరాజు పాల్గొన్నారు.

మైలవరం:మండలంలోని తోలుకోడు గ్రామంరేషన్ షాపు నంబర్ 23లో కొత్త రేషన్ కార్డులు సోమవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఓటులురెడ్డి దుర్గారెడ్డి రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం:ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ఇబ్రహీంపట్నంలో సోమవారం పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డులతో రేషన్ బియ్యం అక్రమాలకు చెక్ పడిందని తెలిపారు. అక్రమాలకు తావు ఉండదని చెప్పారు.

లిఫ్ట్ లాబీలో పడి పెయింటర్ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ లిఫ్ట్ లాబీలో పడి పెయింటర్ మృతి చెందిన ఘటన గొల్లపూడిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి ల్యాంకో కాలనీలో ఎస్‌కేటీ సాయి సుధ అపార్ట్‌మెంట్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకులు పనిచేస్తున్నారు. వారంతా ఫస్ట్‌ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో మనీష్ అనే వ్యక్తి గాలి ఆడడం లేదని అపార్ట్‌మెంట్ పైకి వెళ్లాడు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో అక్కడి వారంతా వెళ్లి చూశారు. సెల్లార్ లిఫ్ట్ లాబీలో పడి మనీష్ గాయాలతో కనిపించాడు. స్థానికుల సహాయంతో అతనిని బయటకు తీసి చూడగా అప్పటికే అతను చనిపోయాడు.

అనుమతులు తప్పనిసరి

ఇబ్రహీంపట్నం:మండలం పరిధిలోని గ్రామాలు, కొండపల్లి మున్సిపాల్టీ ఏరియాలో నిబంధనల మేరకే వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల్లోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. కేటాయించిన ఘాట్లులో నిమజ్జనం చేయాలని తెలిపారు.

ఆగిరిపల్లి: మండలంలో గణేష్ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్సై శుభశేఖర్ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ శాఖల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు: వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని నూజివీడు పట్టణ ఎస్సై కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్సై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు తీసుకున్న తరువాతే మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ముసునూరు: రసాయనిక ఎరువులు అక్రమ నిల్వలు ఉన్నాయనే సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు చేసి కేసులు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి తెలిపారు. మండలంలోని రమణక్కపేట శ్రీసత్యనారాయణ మెన్యూర్స్ హోల్‌సేల్ ట్రేడర్స్, భాగ్యశ్రీ ఎంటర్ ప్రైజెస్ రిటైల్ షాపులపై సోమవారం మూడు శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీసత్యనారాయణ మెన్యూర్స్ హోల్‌సేల్ ట్రేడర్స్‌లో నాలుగు రకాల ఎరువులకు సంబంధించి రూ.7,32,592 విలువైన 50.095 మెట్రిక్ టన్నుల వ్యత్యాసం గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. దీంతో పాటు అదే దుకాణంలో ఎరువుల అమ్మకపు అనుమతి గడువు తీరిపోయినట్లు గుర్తించారు. అనుమతి మంజూరయ్యేంత వరకు ఎరువుల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించారు. అనంతరం భాగ్యశ్రీ ఎంటర్ ప్రైజెస్ రిటైల్ షాపులో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏలూరు విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రంజిత్‌కుమార్, విజిలెన్స్ ఏఓ జి.మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

తిరువూరు:వినాయక చవితి సందర్భంగా గంపలగూడెం మండలం ఊటుకూరులో సోమవారం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఎస్ఆర్‌హెచ్ సేవా సంస్థ, సీసీఆర్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులకు మట్టి గణపతి విగ్రహాలు అందజేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు రామిశెట్టి శ్రీరామ్, పద్మనాభుని మణిదీప్ పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యఖర్చులకు ఆర్థిక సాయం




తిరువూరు:రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరువూరు శ్రీనిధి స్కూలు 8వ తరగతి విద్యార్థి ఈడే భువనేశ్వరకుమార్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ఆ పాఠశాల విద్యార్థులు రూ.1.10 లక్షల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. రోడ్డు ప్రమాదం కారణంగా దెబ్బతిన్న మెదడు సంబంధ చికిత్స నిమిత్తం విద్యార్థి తల్లిదండ్రులు ఆర్థిక సాయం కోరగా, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి వితరణ అందించారు.

అధిక ధరలకు యూరియా అమ్మితే చర్యలు

ఆగిరిపల్లి: మండలంలో ఎరువుల డీలర్లు యూరియాను నిలువ చేసి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ బి.వినూత్న హెచ్చరించారు. ఆగిరిపల్లిలోని ఎరువుల కేంద్రాలను సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఆమె ఎరువుల దుకాణంలోని స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా అమ్మకాల్లో మొదటిగా మండలంలోని రైతులకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యూరియా విక్రయించేటప్పుడు ఎటువంటి ఇతర ఉత్పత్తులను ముడిపెట్టకూడదన్నారు. యూరియాను కృత్రిమ కొరత సృష్టించాలని ప్రయత్నిస్తే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని అవసరమైతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నూజివీడు ఏడీఏ జి.విద్యాసాగర్, తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారిని భవాని పాల్గొన్నారు.

అవగాహన కల్పించి ఎయిడ్స్‌ను అరికడదాం

నూజివీడు: ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టవచ్చని యూనిట్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.లక్ష్మి తెలిపారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ ఎలా వ్యాపిస్తుందనే విషయాలను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే దాని బారిన పడకుండా ఉంటారన్నారు. హెచ్ఐవీ సోకిన వ్యక్తి చూడటానికి ఆరోగ్యంగానే ఉంటారన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకూడదని తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ అవగాహనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ తేజేంద్ర, అధ్యాపకులు, స్నేహా రైడ్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

నూజివీడు: స్త్రీ శక్తి పథకం ద్వారా తమ జీవనోపాధిని కోల్పోతున్నామని ఆటో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. నూజివీడులో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేసూ సోమవారం స్థానిక చిన్న గాంధీబొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం కల్పించడం వలన మహిళలు ఆటోల్లో ప్రయాణించడం మానేశారని తద్వారా ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతిందన్నారు. ప్రతి ఆటో కార్మికుడికి ఏడాదికి రూ.25 వేలను ఇవ్వాలని, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విస్సన్నపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ మల్టీ సర్వీస్ కమ్యూనిటీ హాల్లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నూజివీడు గిఫర్డు మెమోరియల్ కంటి వైద్యులు 76 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 28 మంది కి కంటి ఆపరేషన్లు అవసరం అని గుర్తించారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని క్లబ్ అధ్యక్షురాలు రాయల అరుణ కుమారి అన్నారు. వైద్యశిబిరం క్యాంపు చైర్మన్స్ రేగళ్ల వెంకటేశ్వరరెడ్డి, తుమ్మూరు వెంకటరెడ్డి, క్లబ్ సీనియర్ సభ్యులు సాయి, కుక్కడపు ప్రసాదరావు, ఎన్‌టీ వెంకటేశ్వరరావు, డాక్టర్ రామిరెడ్డి, హనుమంతరావు, జాన్‌బాబు, జేటీ రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

విద్యార్థుల ఆధ్వర్యంలో స్టార్టప్

మైలవరం: డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విద్యార్థులు ఒక కొత్త స్టార్టప్ సోమవారం ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి సోమవారం తెలిపారు. ఆవిష్కాంధ్రం–2025లో భాగంగా కెమిస్ట్రీ విద్యార్థులు క్లీనెస్ట్ అనే ఉత్పాదన ప్రారంభించారన్నారు. క్లీనెస్ట్ ఉత్పాదనలను కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా మంగళగిరిలోని కార్యాలయంలో ప్రారంభించారన్నారు. కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి. కృష్ణ, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ సహెచ్ తులసి, వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారవు, కెమిస్ట్రీ శాఖ అధిపతి డాక్టర్ వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో జెడ్పీ విద్యార్థులు ప్రతిభ

ఇబ్రహీంపట్నం:జిల్లా స్థాయిలో ఇటీవల విజయవాడలో జరిగిన ఆటల పోటీల్లో మండలంలోని పశ్చిమ ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలబాలికలు ఉత్తమ ప్రతిభ చాటారని ఆ పాఠశాల హెచ్ఎం సంతోష్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను సోమవారం అభినందించారు.